

అదను దాటుతోంది

సాగులో అదను దాటితే దిగుబడులపై ప్రభావం చూపుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వివరాలు 8లో ▸



డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం

సమాజం నుంచి డ్రగ్స్ పెనుభూతాన్ని తరిమి కొట్టేందుకు హుస్నాబాద్ డ్రగ్స్ నిర్మూలన జేఏసీ పలు కార్యక్రమాలు చేపడుతోంది. వివరాలు 8లో ▸



జొన్నల డబ్బులేవీ..?

జొన్నలు విక్రయించినా ఇంకా డబ్బులు రాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి

నిజాంపేట(మెదక్): ప్రైవేట్ పాఠశాలల దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జగన్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కనీస వసతులు లేని ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా స్కూళ్లు నడుస్తున్నాయని అన్నారు. పుస్తకాల పేరిట వ్యాపారం చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఫిట్‌నెస్ లేని బస్సులను అధికారులు వెంటనే సీజ్ చేయాలన్నారు. అనుమతి లేకుండా నోట్‌బుక్స్ విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికతో మేలు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్

వెల్దుర్తి (తూప్రాన్): ఒకే దేశం.. ఒకే ఎన్నికతో ఆర్థిక భారం తగ్గి, తద్వారా దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని బస్వాపూర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజలంతా ఒకే దేశం, ఒకే ఎన్నిక కార్యక్రమానికి మద్దతు తెలిపాలని సూచించారు. రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలు పార్లమెంట్ ఎన్నికలతో కలిపి జరిపేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలకిషన్, వెంకటేశం, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి



రైతుకు జీలుగ విత్తనాలు అందజేస్తున్న ఏడీఏ రాజ్‌నారాయణ

రామాయంపేట(మెదక్): పంట మార్పిడితో చీడ పీడల ఉధృతి తగ్గి పంట దిగుబడి పెరుగుతుందని ఏడీఏ రాజ్‌నారాయణ అన్నారు. సోమవారం రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందజేసి మాట్లాడారు. మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగంతో నేలలో భూసారం తగ్గి పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. ఆగ్రో రైతు సేవా కేంద్రంతో పాటు సహకార సంఘం కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఆ స్కూళ్ల గుర్తింపు రద్దు చేయాలి: ఎస్ఎఫ్ఐ

మెదక్ కలెక్టరేట్: అక్రమంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మెదక్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ విషయమై ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ స్కూల్‌లో పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, బెల్టులు, బ్యాగులు అమ్ముతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

మెదక్ ఆర్డీఓ రమాదేవి



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రమాదేవి

పాపన్నపేట(మెదక్): అసైన్‌మెంట్ భూముల సమస్యల పరిష్కారానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి సూచించారు. సోమవారం మండలంలోని కొత్తపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరై మాట్లాడారు. పీఓటీ, సాదాబైనామా, అసైన్‌మెంట్ భూముల విషయంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అందుకనుగుణంగా రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూ రికార్డులకు సంబంధించిన ఆధారాలను జత పర్చాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సతీష్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హత లేని వైద్యం!

ప్రాణాలతో చెలగాటం

- పుట్టగొడుగుల్లా.. నకిలీ వైద్యులు
- జిల్లావ్యాప్తంగా 10 మందికి నోటీసులు



రామాయంపేట(మెదక్): వైద్యుడంటే ప్రాణాలు కాపాడే నారాయణుడిగా భావిస్తారు. అందుకే అంతా వైద్యో నారాయణో హరి అంటారు. అలాంటి వైద్య వృత్తికే కళంకం తెస్తున్నారు కొందరు నకిలీలు. ఎలాంటి అర్హత లేకున్నా మిడి మిడి జ్ఞానంతో వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తాజాగా రామాయంపేటలో జరిగిన సంఘటన ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో కంపౌండర్‌గా పనిచేసిన అనుభవంతో ఓ వ్యక్తి పట్టణం నడిబొడ్డున ఎలాంటి విద్యార్హత లేకున్నా గణపతి క్లినిక్‌ను ప్రారంభించాడు. రోగులు అతడి వద్దకు క్యూ కట్టారు. ఇటీవల ఓ మహిళకు వైద్యం వికటించి ప్రాణాలమీదికొచ్చింది. దీంతో ఆమెను మరో ఆస్పత్రికి తరలించి వైద్య ఖర్చులు భరించి బయటపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేయడంతో క్లినిక్‌ను మూసి పారిపోయాడు. ఇటీవల జిల్లా పరిధిలో 10 మంది నకిలీ వైద్యులకు వైద్యశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు.

అనుమతి లేకుండా ఆస్పత్రుల నిర్వహణ

అమాయక ప్రజలే లక్ష్యంగా జిల్లాలో నకిలీ వైద్యులు చలామణి అవుతున్నారు. అర్హత లేకున్నా వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలమీదికి తెస్తున్నారు. అయితే వైద్యం వికటించి రోగి ప్రాణాల మీదకు వస్తే తప్ప నకిలీల బండారం బయటపడటం లేదు. అలాంటి ఆస్పత్రులపై ఫిర్యాదులు వస్తే తప్ప సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. వైద్యశాఖ అనుమతులు లేకుండానే జిల్లాలో కనీసం 30 వరకు ప్రైవేట్ ఆస్పత్రులు అక్రమంగా కొనసాగుతున్నాయని సమాచారం. రాజకీయ ప్రోద్బలంతో వైద్యశాఖ అధికారులు వీరిపై చర్యలకు వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది.



రామాయంపేటలో ఇటీవల మూతపడిన క్లినిక్

ఆర్ఎంపీల ఇష్టారాజ్యం

జిల్లా పరిధిలో సుమారు 2,500 పైగా ఆర్ఎంపీలు గ్రామాల్లో ప్రాథమిక చికిత్స కేంద్రాలను నడుపుతున్నారు. వారి వద్దకు వస్తున్న రోగులకు వైద్య సలహాలు మాత్రమే ఇవ్వాల్సి ఉండగా, సెలైన్ పెట్టడం ,మందుల చీటి రాయడం వంటివి చేస్తున్నారు. ప్రిస్క్రిప్షన్ రాయడం చట్టప్రకారం నేరం. అలాగే తమ పేర్లకు ముందు డాక్టర్ అని రాసుకోకూడదు. కానీ కొందరు యథేచ్ఛగా నిబంధనలు అతిక్రమిస్తున్నారు.

నకిలీలపై కఠిన చర్యలు



ఎలాంటి అర్హత లేకపోయినా వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవలే జిల్లా పరిధిలో కొందరికి నోటీసులు జారీ చేశాం .నిబంధనల మేరకు ఆర్ఎంపీలు సెలైన్ పెట్టొద్దు. మందులకు సంబంధించి ప్రిస్క్రిప్షన్ రాయొద్దు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం నకిలీలపై చర్యలు తీసుకుంటాం.

– శ్రీరాం, డీఎంహెచ్ఓ


అన్నదాతకు ‘భరోసా’

సకాలంలో పెట్టుబడి సాయం విడుదల చేసిన ప్రభుత్వం

- జిల్లాలో కొత్తగా 6,558 మంది రైతులు

వానాకాలం సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం డబ్బులు విడుదల చేసింది. ఈనెలాఖరులోగా అందరి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నట్లు తెలిపింది. గత యాసంగిలో ఆలస్యంగా రైతు భరోసా ఇవ్వడంతో పెట్టుబడి కోసం అన్నదాతలు ఇబ్బంది పడ్డారు.

– మెదక్‌జోన్



జిల్లావ్యాప్తంగా 2,96,983 మంది రైతులు ఉండగా, సుమారు 4 లక్షల ఎకరాల సాగు భూములు ఉన్నాయి. వాటిలో ఏటా 3.90 లక్షల ఎకరాల వరకు వివిధ రకాల పంటలను సాగుచేస్తున్నారు. కాగా ఈ వానాకాలం సీజన్‌లో 3.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. గత యాసంగి సీజన్‌లో 2,65,629 మంది రైతులకు ప్రభుత్వం రూ. 213.63 కోట్ల పెట్టుబడి సాయం అందించింది. గత రబీతో పోల్చుకుంటే జిల్లాలో 6,558 మంది రైతులకు కొత్తగా పట్టాలు వచ్చాయని, వారికి సైతం ఈ సీజన్‌లో రైతు భరోసా అందిస్తామని అధికారులు చెబుతున్నారు. కాగా గత ప్రభుత్వ హయాంలో వెంచర్లు, గుట్టలు, సాగుకు యోగ్యం కాని భూములకు సైతం రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందించారని కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు ఎన్ని ఎకరాలకు పెట్టుబడి సాయం ఇస్తే బాగుంటుందని గతంలో జిల్లావ్యాప్తంగా రైతులతో సమావేశాలు నిర్వహించింది. దీంతో మెజార్టీ రైతులు 10 ఎకరాల వరకు పెట్టుబడి సాయం ఇవ్వాలని పేర్కొన్నారు. పట్టాలు ఉన్నప్పటికీ సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించి వాటికి పెట్టుబడి సాయం నిలిపివేసింది. అలాంటి భూములు జిల్లావ్యాప్తంగా 6,870 ఎకరాలు ఉన్నట్లు సంబంధిత ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

ఈ వానాకాలం సీజన్‌లో 2,72,187 మంది రైతులకు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందనుంది. గత రబీసీజన్‌లో 2,65,629 మంది రైతులకు గానూ రూ. 213.63 కోట్ల పెట్టుబడి సాయం అందించారు. కాగా అప్పటితో పోలిస్తే కొత్తగా 6,558 మంది రైతులకు పాస్ పుస్తకాలు వచ్చాయి. దీంతో ఈ సంఖ్య 2.72 లక్షలకు చేరుకుంది. ఇదిలాఉండగా జిల్లావ్యాప్తంగా 2,96,983 మంది రైతులు ఉండగా, రైతు భరోసా అందేది మాత్రం 2,72,187 మందికి మాత్రమే. మిగితా 24,796 మందికి భరోసా లేదు. వీరిలో చాలా మంది భూ స్వాములతో పాటు సాగుకు యోగ్యం కాని భూములు గల రైతులు ఉన్నట్లు తెలిసింది.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించండి

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ శాఖలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజావాణికి మొత్తం 85 అర్జీలు రాగా, అత్యధికంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్‌రావుతో పాటు జిల్లాలోని ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం పీఎం దర్తి అభజన్ భాగీదారి అభియాన్ పథకంపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పథకానికి జిల్లాలోని 10 మండలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆధార్, రేషన్ కార్డ్, కుల సర్టిఫికెట్, కిసాన్ క్రెడిట్ కార్డ్, ఆయుష్మాన్ భవ తదితర పథకాలు పొందలేని వారిని గుర్తించనున్నట్లు వివరించారు. వీరికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేలా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. అధికారులు ఈ పథకంపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

తూప్రాన్: ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. సోమవారం బడిబాటలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలని, అప్పుడే ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అక్షరాస్యతలో ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉన్నామని, మొదటి స్థానానికి తేవడానికి ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళిక అమలవుతుందని తెలిపారు. అనంతరం క్విజ్ పోటీల్లో ప్రతిభ కనిబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, ఎంఈఓ సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, నాయకులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కొమరయ్య

పంటల సాగులో మెలకువలు అవసరం

అదనపు కలెక్టర్ నగేష్

నర్సాపూర్ రూరల్/కౌడిపల్లి: రైతుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. సోమవారం మండలంలోని అవంచ, లింగాపూర్ రైతు వేదికలలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో తప్పకుండా పాల్గొని శాస్త్రవేత్తలు చెప్పే విషయాలను విని పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహిపాల్, ఏఓ దీపిక, ఏఈఓలు చంద్రవేణి, దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు. అలాగే కౌడిపల్లి మండలంలోని తునికి రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని విన్నారు.



రైతు నేస్తం కార్యక్రమాన్ని తిలకిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్, రైతులు

పల్లెల అభివృద్ధే లక్ష్యం

ఎంపీ రఘునందన్‌రావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ

మిరుదొడ్డి(దుబ్బాక): పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధికి పాటు పడతానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మండల పరిధిలోని కొండాపూర్‌లో రెడ్డి సంఘం రీడింగ్ రూంకు, ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్న నానుడిని నిజం చేయడానికి తన వంతు శాయవక్తులా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బస్సులు నడపాలని ఆందోళన



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

నర్సాపూర్: పాఠశాలలు ప్రారంభమైనా ఆర్టీసీ అధికారులు జక్కపల్లి మార్గంలో బస్సులు నడపడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మూడు బస్సులు సరిపోవడం లేదని, గత విద్యా సంవత్సరం మరో బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరగా, నడుపుతామని హామీ ఇచ్చి విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఎస్ఐ జగన్నాథం ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతానని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. అనంతరం ఎస్సై డిపో ఇన్‌చార్జితో చర్చించారు. మంగళవారం నుంచి బస్సులు నడుపుతామని తెలిపారు. రాస్తారోకోతో హైదరాబాద్, మెదక్ మార్గంలో రోడ్డుపై పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.

రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతాం

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

పాపన్నపేట(మెదక్): రైతు సంక్షేమమే ఊపిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని పొడిచన్‌పల్లి రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రతి మంగళవారం శాస్త్రవేత్తలతో 57 రైతు వేదికల్లో సుస్థిర వ్యవసాయంపై సలహాలు అందిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించామన్నారు. జిల్లాలో రైతు భరోసా కింద 2.26 లక్షల మందికి రూ.140 కోట్లు వారి ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన 35 వేల మంది రైతులకు రాబోయే 9 రోజుల్లో జమ చేస్తామన్నారు. అలాగే సన్న వడ్లకు రూ. 500 బోనస్ వస్తుందన్నారు. కార్యక్రమంలో డీఏఓ వినయ్, ఉద్యావన అధికారి ప్రతాప్‌సింగ్, ఏఓ నాగమాధురి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, గోవింద్, రైతులు పాల్గొన్నారు.



సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే రోహిత్, కలెక్టర్, అధికారులు

ఇంటర్ సప్లిమెంటరీలో 55.75 శాతం ఉత్తీర్ణత

మెదక్ కలెక్టరేట్: ఇటీవల జరిగిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో 57.75 శాతం ఉత్తీర్ణతతో జిల్లా 18వ స్థానంలో నిలిచినట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరంలో 3,626 మంది పరీక్ష రాయగా, 2,099 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 2,214 మంది పరీక్షలకు హాజరు కాగా, 1,274 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు

ఎస్పీ శ్రీనివాస్‌రావు

పెద్దశంకరంపేట(మెదక్)/అల్లాదుర్గం/రేగోడ్: జిల్లాలో పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ డాక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. సోమవారం పెద్ద శంకరంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. జాతీయ రహదారి కావడంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, దొంగతనాల నివారణకు గస్తీని పెంచాలని, రహదారి నిబంధనలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం అల్లాదుర్గం , రేగోడ్ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. పాత కేసుల వివరాలు, రికార్డులు పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టాలన్నారు. వాహనాలు తనిఖీ చేస్తూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐలు ప్రవీణ్‌రెడ్డి, శంకర్, సందీప్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

సమస్యలపై నేరుగా సంప్రదించండి

మెదక్ మున్సిపాలిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, నేరుగా వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలపై సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

క్లుప్తంగా

మల్లన్న ఆలయంలో వేలం పాట

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం ఆలయానికి సంబంధించి ఈ టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలంను ఆలయ ఈఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. మల్లన్న సమావేశ మందిరంలో తదితర వాటిపై లైసెన్సు హక్కును పొందేందుకు వేలం నిర్వహించారు. కొబ్బరి ముక్కలు సేకరించేందుకు లైసెన్సు హక్కును కురవికి చెందిన యుగేందర్ రూ.71,77,777కు, వస్త్రాలు, ఒడి బియ్యం, పసుపు సేకరించే హక్కును కొమురవెల్లికి చెందిన ఉప్పల వంశీకృష్ణ రూ.70,56,000కు దక్కించుకున్నారు. కోరమీసాలు, మొక్కుబడి వస్త్రాల విక్రయించే హక్కును ఎక్కాల దేవి అరుణ రూ.16,61,000లకు దక్కించుకోగా, టాయిలెట్స్ నిర్వహణ హక్కును మిత్రా ఎంటర్‌ప్రైజెస్ రూ.4,71,000లకు దక్కించుకున్నారు. ఆలయానికి పాలు పెరుగు సరఫరా చేసే హక్కును కడెం సిద్దులు, ఆలయంలో వీడియో, ఫొటోలు తీసే లైసెన్సు హక్కును మల్లం నవీన్ దక్కించుకున్నారు. అలాగే ఆలయంలో కొబ్బరి కాయల విక్రయం, ఎల్లమ్మ ఆలయం వద్ద కూల్‌డ్రింక్స్, పూల సరఫరా, బుక్స్ ప్రింటింగ్ కోసం నిర్వహించిన వేలంలో సరైన ధర రాకపోవడంతో వాటిని వాయిదా వేస్తున్నట్లు ఆలయ ఈఓ పేర్కొన్నారు.

ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు



దళిత కుటుంబానికి న్యాయం చేయాలని వినతి పత్రం అందిస్తున్న శంకర్

చేగుంట(తూప్రాన్): మండలంలోని పొలంపల్లిలో దళితుడు సత్యనారాయణ వ్యవసాయ భూమిలో అక్రమంగా నిర్మించిన సెల్ టవర్‌ను తొలగించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు చేసినట్లు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో దళితుడి భూమి ఆక్రమణతో పాటు సెల్‌టవర్ అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబీకులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో దళిత సంఘాల నాయకులు అశోక్, స్వామి, సంజీవ్ తదితరులు ఉన్నారు.

మహిళ అదృశ్యం



పద్మ

నర్సాపూర్ రూరల్: మహిళ అదృశ్యమైన ఘటన నర్సాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన ఖాజిపల్లి నర్సిములు భార్య పద్మ (37) గత నెల 20న తన తల్లిగారి ఊరు రుస్తుంపేటకు వెళ్లొస్తానని చెప్పి బయలు దేరింది. తిరిగి ఇంటికి రాలేదు. బంధువులతోపాటు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుదాఘాతంతో పాడి గేదె మృత్యువాత పడింది.ఈ ఘటన మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు శంకర్‌గౌడ్ పాడి గేదెలతో ఉపాధి పొందుతున్నాడు. రోజువారీగానే గేదెలను మేత కోసం వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం సపోర్టు వైరుకు పాడి గేదె తగలడంతో షాక్ కొట్టింది. దీంతో పాడి గేదే మృతి చెందింది. రూ. 60 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

పెద్దశంకరంపేట మండలంలో నెమలి..



విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన నెమలి

పెద్దశంకరంపేట(మెదక్): విద్యుదాఘాతంతో నెమలి మృతిచెందింది. ఈ ఘటన మండల కేంద్రంలోని ప్రియాంక కాలనీలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. జనావాసాల్లోకి వచ్చిన నెమలి ప్రమాదవశాత్తు ఎగురుతూ విద్యుత్ వైర్లకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి వచ్చి నెమలిని తీసుకెళ్లారు.

13 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ వివరాల ప్రకారం... ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిని పట్టుకున్నారు. సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 10 మందికి రూ.వెయ్యి, ముగ్గురికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

అదను దాటుతోంది

ఆశించిన స్థాయిలో కురవని వర్షం

- గడువు దాటి విత్తితే దిగుబడిపై ప్రభావం
- వానలొస్తే జూలై 15 వరకు విత్తవచ్చు
- ఆగస్టు 15వరకు వరి నాట్లు పూర్తి చేయాలి
- వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు



గుడికందులలో పత్తి గింజలు విత్తుతున్న రైతులు



పల్లవి, వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త

దుబ్బాకటౌన్: రైతులు ఆశించిన దిగుబడులు సాధించాలంటే సాగులో విత్తనాలు విత్తే సమయం అత్యంత కీలకమని ఏరువాక వ్యవసాయ పరిశోధన సంస్థ తోర్నాల శాస్త్రవేత్త పల్లవి సూచిస్తున్నారు. వానాకాలం సీజన్ ఆరంభంలోనే వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు పొలం బాట పడుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. మరికొందరు వరి నారు పోసేందుకు సిద్ధమవుతున్నారు. సాగులో అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, చేపట్టాల్సిన విధి విధానాలను ఆమె వివరించారు. పత్తి, వరి, పప్పుధాన్యాలు, కంది, మొక్కజొన్న పంటలపై రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి యాంత్రిక సాగుపై సైతం వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వాతావరణ కేంద్రం అధికారుల అంచనా ప్రకారం ఈ సారి సాధారణ వర్ష పాతమే నమోదయ్యే అవకాశం ఉంది. కావున రైతులందరూ పరిస్థితులకనుగుణంగా పంటలు ఎంపిక చేసుకోవాలి. భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని చెబుతున్నారు.

వరి: సాగు చేసే రైతులు దీర్ఘకాల రకాలను ఈ నెల 25 వరకు వరి నారు పోసుకోవాలి. మధ్య కాలిక రకాలు అయితే జూలై 10 వరకు నారు పోసుకోవచ్చు. జూలై 31వరకు స్వల్ప కాలిక రకాల నార్లు పోసేందుకు సమయం ఉంది. ఆగస్టు 15 వరకు అన్ని రకాల వరి నాట్లను పూర్తి చేయాలి. నార్లు పోసే సమయంలో విత్తనాలను తప్పకుండా శుద్ధి చేయాలి.

పత్తి:

అనుకున్నట్లు వర్షాలు కురిస్తే జూలై 15 వరకు పత్తి విత్తనాలను విత్తుకోవచ్చు. విత్తడంలో ఆలస్యం చేస్తే దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. పంట మార్పిడి విధానం పాటించాలి. పెసర, అంతర పంటలుగా వేసుకుంటే మంచిది. ప్రభుత్వం అనుమతిచ్చిన సుమారు 20 సంస్థలకు చెందిన బీటీ-2 పత్తి విత్తనాలను మాత్రమే విత్తుకోవాలి. ఎకరానికి సాగు చేసే భూమిని బట్టి 8 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పంటను డిసెంబర్ వరకు తీసివేయాలి. రెండవ పంటగా మొక్కజొన్న, పెసర, కూరగాయలు, పొద్దుతిరుగుడు వేసుకుంటే మేలు. పత్తి విత్తనాలను విత్తిన రెండు రోజుల తర్వాత పెండిమిథిలిన్ 38.5 శాతం 700 మి.లీ. ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయడం వల్ల కలుపును నివారించవచ్చు.

దొడ్డు రకాలు: కూనరం సన్నాలు, బతుకమ్మ, కాటన్ దొర సన్నాల రకాల పంట కాలం 120 రోజులు కాగా ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. తెలంగాణ సోన , కేఎస్ఎం-1638 పంట కాలం 125 నుంచి 130 రోజులు కాగా, ఎకరానికి 28 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

దీర్ఘకాలిక సన్న రకాలు: సాంబమసూరి పంట కాలం 150 రోజులు, ఎకరాకు 28క్వింటాళ్లు, జైశ్రీరాం రకం పంట కాలం 145 నుంచి 150 రోజులు, ఎకరానికి 24 క్వింటాళ్ల దిగుబడి పొందే అవకాశం ఉంటుంది.

కంది: కంది, మినుము, పెసర పంటలను జూలై 15 వరకు విత్తుకోవాలి. పత్తి, మొక్కజొన్న పంటల్లో కందిని అంతర పంటగా వేసుకోవచ్చు. డబ్ల్యూఆర్‌జీ-93 కంది రకం పంట కాలం 155 నుంచి 165 రోజులు కాగా ఎకరానికి 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చు. డబ్ల్యూఆర్‌జీ-97 కంది రకం పంట కాలం 150 నుంచి 160 రోజులు కాగా ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. డబ్ల్యూఆర్‌జీ -255, టీడీఆర్జీ-59 ఈ రెండు రకాలకు 180 రోజులు పంట కాలం కాగా ఎండు తెగులు తట్టుకుని 8 నుంచి 10 క్వీటాళ్ల దిగుబడి వస్తుంది.

మొక్కజొన్న: జూలై 15 వరకు మొక్కజొన్న సాగు చేసుకోవచ్చు. మార్కెట్లో లభించే హైబ్రిడ్ రకాల్లో సాగు భూమికి అనుకూలమైనవి ఎంపిక చేసుకోవాలి. మొక్కజొన్నను ఒక పంటగా కాకుండా కందితో కలిపి అంతర పంటగా వేసుకుంటే మంచిది.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



సిద్దిపేటలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్

బెజ్జంకి(సిద్దిపేట): నకిలీ విత్తనాలపై అధికారులు దృష్టి సారించారు. బెజ్జంకిలో ముగ్గురు అనుమానితుల నుంచి 160 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నామని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్ తెలిపారు. సోమవారం సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సీపీ అనురాధ ఆదేశాల మేరకు ఆదివారం బెజ్జంకిలో టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు, మండల ఏఓలు తనిఖీలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా కొత్తపేట మండలం సర్వాయిపేటకు చెందిన దుర్గం శేఖర్ వద్ద 4 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. నిందితుడిని విచారించగా బెజ్జంకి శివారులోని పాడుబడిన పట్టుపురుగుల కేంద్రం వద్ద నిల్వ చేసినట్లు తెలిపాడు. అక్కడ దాడి చేసి నాలుగు బస్తాల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్న కడప జిల్లాలోని మైదుకూరుకు చెందిన ఇనుకొండ వసంత రాంరెడ్డి, నంద్యాల జిల్లా కొండపల్లికి చెందిన కుందవరం ప్రభాకర్, దుర్గం శేఖర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి ఎస్‌లు జానకిరాంరెడ్డి, రమేష్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చోరీ

గ్యాస్ సిలిండర్, మోటార్ అపహరణ



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రంజిత్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చోరీ జరిగింది. కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం... శుక్రవారం సాయంత్రం రోజు మాదిరిగా కళాశాల సమయం ముగియగానే తాళాలు వేశారు. శని, ఆదివారం సెలవు కావడంతో సోమవారం యథావిధిగా కళాశాలకు రాగా.. ఆఫీస్‌రూం, స్టాఫ్‌రూం, వాటర్ ప్లాంట్ గది తాళాలు ధ్వంసమై ఉన్నాయి. చోరీకి పాల్పడ్డ దొంగలు కెమిస్ట్రీ ల్యాబ్‌కు సంబంధించిన రెండు గ్యాస్ సిలిండర్లు, వాటర్ ప్లాంట్ గదిలో నుంచి వన్‌హెచ్‌పీ మోటార్ తీసుకొచ్చి బయటపెట్టాడు. ఒక గ్యాస్ సిలిండర్, మోటార్‌ను చోరీ చేశారు. మరో సిలిండర్ గోడ పక్కన పెట్టగా, ఆఫీస్‌రూంలోని రెండు కంప్యూటర్లు, మానిటర్, మౌస్, కీబోర్డు, సీసీ కెమెరాను బ్యాగ్‌లో పెట్టుకుని వరండాలోనే వదిలేసి వెళ్లాడు. సీసీ కెమెరాలు శనివారం మధ్యాహ్నం వరకు పనిచేశాయని, ఆ తరువాత పనిచేయలేదని ప్రిన్సిపాల్ చెప్పారు. క్లూస్‌టీం అధికారులు చోరీకి సంబంధించి ఆధారాలు సేకరించారు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెలవెల బోయిన రైతు నేస్తం

- ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చిన రైతువేదిక
- కనిపించని రైతులు, వ్యవసాయ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు



ఖాళీగా దర్శనమిస్తున్న చిన్నశంకరంపేట రైతు వేదిక

చిన్నశంకరంపేట(మెదక్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమానికి రైతులు, అధికారులు రాక వెలవెల బోయింది. ఈ ఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి తన సందేశాన్ని వినిపించడంతో పాటు రైతు భరోసా నిధులు విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని రైతులు వీక్షించేలా రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొనేలా చూడాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, సిద్ధిరాములు, మోహన్‌నాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి వచ్చారు. కానీ రైతులు, అధికారులు రైతువేదికలో లేకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. రైతువేదిక సహాయకుడు నర్సింహులు వీడియో కాన్ఫరెన్స్‌ను ఆన్‌చేసి పెట్టారు. రైతులు మాత్రం ఒక్కరు కూడా హాజరు కాలేదు. ఈ విషయంపై ఏఓ ప్రవీణ్‌కుమార్‌కు ఫోన్ చేసి కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు కనిపించకపోవడంపై ఆయనను ప్రశ్నించగా తాను గవ్వలపల్లి రైతు వేదికలో ఉన్నానని తెలిపారు. ఏఈఓ ఎక్కడున్నారని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. తాను అక్కడికి వస్తానని చెప్పి సీఎం సమావేశం ముగిసే సమయానికి ఆయన రైతు వేదిక వద్దకు చేరుకున్నారు.

బావిలో పడి రైతు మృతి



రాజయ్య (ఫైల్)



మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఫైర్ సిబ్బంది

నంగునూరు(సిద్దిపేట): వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లిన రైతు బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం నాగరాజుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ముక్కెర రాజయ్య(50) వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ కోసం వెతకగా సొంత వ్యవసాయ బావిలో చెప్పులు కనిపించాయి. ఘటనా స్థలానికి ఎస్ఐ ఆసీఫ్ చేరుకొని ఫైర్ సిబ్బందిని పిలిపించారు. రెండు గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్.. యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: బైక్‌ను టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దుర్గయ్య వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్‌వార్(25) బతుకుదెరువు కోసం జిన్నారం మండలం.. మాదారం గ్రామానికి వచ్చి, ఇల్లు అద్దెకు తీసుకొని స్క్రాప్ షాప్‌లో పని చేస్తున్నాడు. సోమవారం బైక్‌పై ఇస్నాపూర్ వెళ్లేందుకు సుల్తాన్‌పూర్ మీదుగా వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో కిష్టారెడ్డిపేట సర్వీస్ రోడ్డులో వెనుక నుంచి బైకును టిప్పర్ ఢీకొట్టింది. రాజ్‌వార్‌పై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టిన కారు

ప్రమాదంలో ఇద్దరు మృతి



అనిల్ (ఫైల్)

దుబ్బాకరూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని తిమ్మాపూర్ వద్ద జరిగింది. ఎస్ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం... అక్బర్‌పేట భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి గ్రామానికి చెందిన పల్లె అనిల్(27), అతని మిత్రుడు ఉచ్చురి పాపయ్య(30) ఈనెల15న రాత్రి పది గంటల సమయంలో సిద్దిపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో సిద్దిపేట వైపు నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న (స్విఫ్ట్ డిజైర్)కారు అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అనిల్‌ను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పాపయ్యను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా పాపయ్య స్వగ్రామం ఏపీలోని ఒంగోలు జిల్లా, వేమవరం గ్రామం. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కారును అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏసీబీకీ చిక్కిన పంచాయతీ కార్యదర్శి

లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ ఉద్యోగి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కింది. బుదేరా గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సోమవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ సుదర్శన్ వివరాల ప్రకారం... కోహిర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో వాటర్ సర్వీసింగ్ సెంటర్, ఓపెన్ ప్లాట్‌కు కొత్త ఇంటి నంబర్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దీనికి పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి రూ.8వేల లంచం డిమాండ్ చేసింది. బాధితుడు ఆమె అడిగినంత ఇస్తానని ఒప్పందం చేసుకుని నేరుగా ఏసీబీ అధికారులను సంప్రదించాడు. పంచాయతీ కార్యదర్శి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. భద్రత కారణాల వల్ల ఫిర్యాదు దారుడి వివరాలను గోప్యంగా ఉంచుతున్నామని తెలిపారు. నాగలక్ష్మిని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని నాంపల్లి స్పెషల్ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే పంచాయతీ కార్యదర్శిగా మునిపల్లి మండంలో 18 సంవత్సరాలుగా ఆమె విధులు నిర్వహిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. మండల స్థాయి అధికారులు బదిలీపై ఇతర చోట్లకు వెళ్లారు. కానీ ఆ కార్యదర్శి మాత్రం మునిపల్లి మండలంలోనే విధులు నిర్వహించడం గమనార్హం. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే తమను సంప్రదించాలని ఏసీబీ డీఎస్పీ పేర్కొన్నారు. ఏసీబీ ఎస్ఐలు రమేశ్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

మేడారంలో ఘటన

ఎస్ఎస్ తాడ్వాయి: అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా ముస్తాబాద్‌కు చెందిన పిల్లి సత్యం (50), జ్యోతి దంపతులు 12 సంవత్సరాల నుంచి మేడారంలో గాజుల దుకాణం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సత్యం వ్యాపారం కోసం రూ. 10 లక్షల అప్పు చేశాడు. వ్యాపారం సరిగా నడవకపోవడంతోపాటు అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో అప్పు ఎలా తీర్చాలని కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం దుకాణం వెనుక రేకుల షెడ్డులో ఉరేసుకున్నాడు. ఈ ఘటనపై మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మృతుడి కుమారులు పవన్, అఖిల్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం

- నిర్మూలనే లక్ష్యంగా జేఏసీ ఆధ్వర్యంలో పోరు యాత్ర
- పల్లెలకు విస్తరిస్తున్న మాదక ద్రవ్యాలు
- పేద కుటుంబాలు విచ్ఛిన్నం
- నియోజకవర్గంలో అవగాహన సమావేశాలు



మల్లంపల్లిలో అవగాహన కల్పిస్తున్న జేఏసీ నాయకులు

హుస్నాబాద్: డ్రగ్స్‌ను తరిమికొడుదాం.. చక్కగా చదువుకుందాం..జ్ఞానాన్ని పెంచుకుందామనే నినాదంతో హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్రకు నడుం బిగించింది. పల్లెల్లో విస్తరిస్తున్న డ్రగ్స్‌ను తరిమివేయాలనే సంకల్పంతో గ్రామ గ్రామాన ర్యాలీలు, అవగాహన సదస్సులతో ప్రజలను చైతన్యపరుస్తున్నారు. డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాల గూర్చి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏప్రిల్ 21న నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మాణిక్యాపూర్ నుంచి ప్రారంభించారు. ఇప్పటి వరకు భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామడి మండలాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించారు.

యువతను చైతన్య పరుస్తూ..

ఈ పోరు యాత్రలో ప్రజా, మహిళ, విద్యార్థి సంఘాలు, విశ్రాంత ఉద్యోగులు, విద్యావంతులు, సామాజిక వేత్తలను భాగస్వాములను చేస్తూ యువతను చైతన్యపరుస్తున్నారు. నగరాలు, పట్టణాలకే పరిమితమైన డ్రగ్స్ మహమ్మారి పల్లెలకు పాకింది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు, నిషా వ్యవస్థలు సైతం డ్రగ్స్‌ను అరికట్టేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతే టార్గెట్‌గా మత్తు పదార్థాలు విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారు. చదువుకోవాల్సిన వయస్సులో యువత వాటికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మత్తులో విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారు.

వెలుగులోకి వస్తున్న ఘటనలు..

- ధర్మరాజు పల్లెలో ఓ యువకుడు బెట్టింగ్‌లో దాదాపు రూ.5కోట్లు నష్టపోయి, అంతా అయిపోయాక కూలీ పనులు చేసుకుంటున్న ఘటన వెలుగులోకి వచ్చింది.
- శనిగరంలో మొబైల్ కొనివ్వకపోతే తన కొడుకు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్నాడని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది.
- ఓ గ్రామంలో ఇంటర్మీడియెట్ స్థాయికి మించి చదువుకున్న వారు లేరని, బెట్టింగ్‌లో పాల్గొంటూ మగవారి కంటే మహిళలే ఎక్కువగా డ్రగ్స్ వాడుతున్నారని జేఏసీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు.
- మైసంపల్లి గ్రామంలో బెట్టింగ్ ఆడి తీవ్రంగా నష్టపోయి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

అవగాహన కార్యక్రమాలు

గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి సహకారంతో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నారు. యువతను కాపాడుకోవాలని, ఎవరితో మాట్లాడుతున్నారు? ఏం చేస్తున్నారు? కనిపెట్టాలని తల్లిదండ్రులకు వక్తలు సూచిస్తున్నారు. మెదడుపై ప్రభావితం చూపే డ్రగ్స్ వినియోగం వల్ల విచక్షణ రహితంగా హత్యలు, ఆత్మహత్యలకు పాల్పడతారని తెలియజేస్తున్నారు. డ్రగ్స్‌కు, బెట్టింగ్‌లకు యువతను దూరంగా ఉంచి చదువుకు దగ్గర చేయాలని కోరుతున్నారు.

సమష్టిగా ఉద్యమిస్తే అరికట్టవచ్చు



గ్రామాల్లో డ్రగ్స్ విచ్చలవిడిగా సరఫరా అవుతోంది. డ్రగ్స్ ఎవరు వాడుతున్నారో, ఎక్కడి నుంచి వస్తోందో తెలిసిన మహిళలు చెప్పేందుకు భయపడుతున్నారు. సారా నిర్మూలనకు మహిళలు పోరాటం చేసినట్లుగా, డ్రగ్స్ నిర్మూలనకు అదే స్థాయిలో ఉద్యమిస్తే తప్ప అరికట్టలేం. ప్రభుత్వం, పోలీసులు, మహిళలు, ప్రజలందరు సమష్టిగా ఉద్యమిస్తే డ్రగ్స్ నిర్మూలనను పూర్తిగా నిర్మూలించవచ్చు. ఈ నెలాఖరులోగా పోరు యాత్ర సభను నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తాం.

– మేకల వీరన్న యాదవ్, డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర నియోజకవర్గ కో ఆర్డినేటర్, హుస్నాబాద్



డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ సదానందం(ఫైల్)